నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
5 | శనివారం 10 ఫిబ్రవరి 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



పీవీ ఇంట్లో ఆయన విగ్రహానికి పూలమాల వేస్తున్న అతని తమ్ముని కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు, గ్రామస్తులు




డప్పుచప్పుళ్లతో సంబురాలు జరుపుకొంటున్న వంగర గ్రామస్తులు

# మన పీవీ

# భారతరత్నం

**దివంగత మాజీ ప్రధానికి అరుదైన పురస్కారం.. భారతరత్న అవార్డుపై సర్వత్రా హర్షం**



### పీవీ ప్రొఫైల్ :

పూర్తి పేరు : పాములపర్తి వెంకట నరసింహారావు
తల్లిదండ్రులు : రుక్మిణీదేవి-సీతారామారావు
భార్య : సత్తెమ్మ
పుట్టిన తేదీ : 28.06.1921
విద్యాభ్యాసం : బీఎస్సీ, ఎల్ఎల్‌వీ
సంతానం : ముగ్గురు కొడుకులు, ఐదుగురు కూతుళ్లు
రాజకీయ పదవులు : 1957-1977 వరకు మంథని ఎమ్మెల్యే
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి : 1971-1973
హనుమకొండ ఎంపీ : 1977-1984(రెండుసార్లు)
రామ్‌టెక్(మహారాష్ట్ర) ఎంపీ : 1984-1991 వరకు (రెండుసార్లు)
కర్నూలు జిల్లా నంద్యాల ఎంపీ(ఆంధ్రప్రదేశ్): 1991-1996
బరంపూర్(ఒడిశా) ఎంపీ : 1996-1998 వరకు
1991లో భారత ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి మాజీ ప్రధాని దివంగత పాములపర్తి వెంకటనర్సింహారావుకు అత్యున్నత పురస్కారం లభించింది. ఆయన అభిమానుల ఎన్నో ఏళ్ల కలను సాకారం చేస్తూ కేంద్రప్రభుత్వం శుక్రవారం పీవీకి భారతరత్న అవార్డు ప్రకటించగా ఆయన స్వగ్రామం వంగరలో సంబురం అంబరాన్నంటింది. దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన పీవీని నాడు కాంగ్రెస్ పాలకులు విస్మరించినా స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కారు సముచిత గౌరవం ఇచ్చింది. జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడంతో పాటు శతజయంతి ఉత్సవాలను ఏడాది పాటు పండుగలా చేసి ప్రత్యేక స్థానం కల్పించింది. తాజాగా కేంద్రం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ హర్షం వ్యక్తంచేశారు.

– భీమదేవరపల్లి/నర్సంపేట రూరల్, ఫిబ్రవరి 9

- స్వగ్రామం వంగరలో మిన్నంటిన సంబురం
- రాజకీయాల్లో చెరగని ముద్రవేసిన మౌనముని
- నాడు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- స్వరాష్ట్రంలో కేసీఆర్ వల్లే నరసింహారావుకు అరుదైన గౌరవం
- అధికారికంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలు

పీవీకి కేంద్రప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఆయన స్వగ్రామం వంగరలో అభిమానులు, గ్రామస్తులు సంబురాలు జరుపుకొన్నారు. ఆయనకు హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామం, వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లితో అనుబంధం ఉంది. పీవీ నర్సింహారావు లక్నేపల్లిలోని అమ్మమ్మ ఇంట్లో రుక్మిణీదేవి-సీతారామారావు దంపతులకు 1921 జూన్ 28న జన్మించారు. పీవీకి ఇద్దరు తమ్ముళ్లు మాధవరావు, మనోహర్‌రావు, సోదరి సరోజినీదేవి ఉన్నారు. పీవీ అంచెలంచెలుగా ఎదిగి ప్రధాని అయ్యారు. మారుమూల గ్రామంలో పుట్టి దేశం గర్వించదగిన మహోన్నత వ్యక్తి ఆయన. పీవీ నర్సింహారావు చనిపోయిన పదిరోజులకే సోదరి సరోజినీదేవి కూడా మృతి చెందారు. ఆయనను కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పీవీకి అరుదైన గౌరవాన్ని కల్పించారు. కేసీఆర్ ప్రభుత్వం పీవీ శత జయంతి ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించింది.

### కాకతీయ పత్రిక

పీవీ తన సన్నిహితుడు పాములపర్తి సదాశివరావుతో కలిసి 1944లో కాకతీయ పత్రికను వరంగల్ జిల్లాలో స్థాపించారు. 1946-1955 వరకు వార పత్రికను కొనసాగించారు. ఇందులో గొల్ల రామవ్వకథ, నీలిరంగు పట్టుచీర, మంగయ్యజీవితం లాంటి రచనలు అప్పటి సామాజిక జీవనానికి అద్దం పట్టాయి. పీవీ రచించిన ఆర్తగీతికలు కాకతీయ పత్రికలో ప్రచురితమయ్యాయి. పీవీ రాసిన తన ఆత్మకథ 'లోపలి మనిషి'లో భారతదేశ చరిత్ర, హైదరాబాద్ సంస్థానంలోని విశిష్టమైన అంశాలను, జరిగిన పరిణామాల గురించి వివరించారు.

### సాహితీ సంపన్నుడు

పీవీ బహుభాషా కోవిదుడు. నిజాం కాలంలో చదువుకున్న వారికి తెలుగు, హిందీ, ఇంగ్లిషు, ఉర్దూ భాషల్లో సహజంగా ప్రావీణ్యం ఉంటుంది. పీవీకి మాత్రం 17 భాషల్లో ప్రావీణ్యం ఉంది. తెలుగు, మరాఠీ, హిందీ, ఇంగ్లిషు, తమిళం, ఫ్రెంచ్ భాషల్లో ప్రావీణ్యం ఉందని చెబుతారు. మరాఠీ నవలలను తెలుగులోకి, తెలుగు గ్రంథాలను హిందీలోకి అనువాదం చేశారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన వేయిపడగలును సహస్రఫణ్ పేరుతో హిందీలోకి అనువాదం చేశారు. హరినారాయణ్ ఆప్టే మరాఠీ ప్రసిద్ధ నవల 'పాన్ లక్షత్ కోన్‌ఘెటా'ను పీవీ అబల జీవితం పేరుతో తెలుగులో అనువదించారు.



స్వగ్రామం వంగరలో పీవీ విగ్రహం

### ఉద్వేగంగా ఆలపించిన గీతం

సమైక్య రాష్ట్రానికి పీవీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1972 ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య రజతోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అర్ధరాత్రి జరిగిన శాసనసభలో పీవీ ఉద్వేగభరితంగా గీతాన్ని ఆలపించారు.'ఈ నిద్రాణ నిశీథి మహిత జాగృతి పుం జముగ వెలుగుటే నా తపస్సు, వెలిగించుట నా ప్రతిజ్ఞ..!' అనడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల చప్పట్లతో సభ మార్మోగింది.

### విద్యార్థి దశ నుంచే చురుగ్గా..

వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం మొదలుపెట్టారు. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. కళాశాల చదువు కోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. అక్కడ వందేమాతరం ఆలపించడంతో సహచరులతో పాటు పీవీని విశ్వవిద్యాలయం నుంచి అప్పటి నిజాం ప్రభుత్వం బహిష్కరించింది. నిజాం ఏలుబడిలోని ఏ ప్రాంతంలోనూ చదివేందుకు వీలు లేదని అప్పటి ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. విద్యార్థి దశ నుంచే నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. కొంతకాలం అజ్ఞాతవాసం ఉండి చాందా క్యాంపులో క్రియాశీలక పాత్ర పోషించారు. హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అనంతరం ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు.

### సాధించిన విజయాలు..

పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలు దివాళా స్థాయికి చేరుకుని ఆర్థికవ్యవస్థ పూర్తిగా దిగజారింది. ఆ సమయంలో పీవీ తన శక్తియుక్తులు, రాజకీయ చతురతతో సరళీకృత ఆర్థిక విధానం ప్రవేశపెట్టి ఆర్థిక వ్యవస్థకు గాడిన పడేసి పునరుజ్జీవం కల్పించారు. దీంతో పీవీకి ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేరు వచ్చింది. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచివేసిన ఘనత కూడా పీవీకే దక్కుతుంది. దేశంలో అణుపరీక్షలు మొదలుపెట్టింది పీవీ సర్కారే. పీవీపై గౌరవంతో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఏకంగా కేంద్ర మానవ వనరుల శాఖను ఆయన కోసమే ఏర్పాటు చేశారు. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను పీవీ ప్రజల కోసం వినియోగించారు.



వంగరలోని పీవీ మ్యూజియంలో ఫొటోగ్యాలరీ



### వంగరలో పీవీ మ్యూజియం

పీవీ నరసింహారావు ఇంటిని అతని కుటుంబసభ్యులు మ్యూజియంగా మార్చారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో పీవీ ఇల్లు ఉంది. పీవీ భారత ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన వినియోగించిన వస్తువులను, ఫొటోలను పదిలపరిచారు. నర్సింహారావు ఫొటోలను ప్రత్యేక గ్యాలరీగా అమర్చారు. ఆయన ప్రధానిగా దేశ, విదేశాల్లో చేపట్టిన కార్యక్రమాలు ఫొటో గ్యాలరీలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. పీవీ వినియోగించిన కారు ఇంటి ఆవరణలో ప్రదర్శనకు ఉంచారు. పీవీ ఇంటి ఎదుట అతడి కాంస్య విగ్రహం ఏర్పాటుచేశారు. ఏటా పీవీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అతని కుటుంబసభ్యులు ఇక్కడే నిర్వహిస్తారు.

### పీవీకి భారతరత్న రావడం గర్వకారణం



యావత్ జాతి మరువలేని నేత మన పీవీ. దేశ ఆర్థిక వ్యవస్థను ఆయువుపట్టుగా నిలిపాడు. పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణల ఫలాలనే ప్రస్తుతం దేశం అనుభవిస్తున్నది. ఆయనకు భారతరత్న రావడం దేశ, రాష్ట్ర ప్రజలకు గర్వకారణం. పీవీ పుట్టిన గడ్డకు ఎమ్మెల్యేగా, రాష్ట్రమంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– పొన్నం ప్రభాకర్, మంత్రి

### ప్రపంచం గర్వించదగ్గ నేత



ప్రపంచం గర్వించదగ్గ నేత పీవీ. సరళీకృత ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల పారిశ్రామిక రంగంలో ఎన్నో పెట్టుబడులు వచ్చాయి. కోట్లాది మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయి. పీవీ లేని దేశాన్ని ఊహించుకోలేం. పీవీతో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. పీవీకి భారతరత్న రావడం, ఆయన మన ప్రాంత ముద్దుబిడ్డ కావడం నిజంగా గర్వకారణం.

– వొడితల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

### పీవీకి తగిన గుర్తింపు..



పీవీ ప్రధానిగా ఉన్న సమయంలో మన దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వం మైనార్టీలో ఉన్నప్పటికీ పీవీ నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశ ఆర్థిక ప్రగతిని గాడిన పెట్టారు. ప్రాంతాన్ని కాకుండా దేశాన్ని ఒక కుటుంబంగా చూసిన మహనీయుడు. పీవీకి భారతరత్న ప్రకటించిన ప్రధాని మోదీకి అభినందనలు.

– మదన్‌మోహన్‌రావు, పీవీ సోదరుడి కుమారుడు

### గర్వకారణం



జనగామ, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : పీవీకి భారతరత్న ప్రకటించడం గర్వకారణం. పలుమార్లు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేంద్రాన్ని కోరడమే కాకుండా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపారు. పీవీ కూతురు వాణీదేవికి ఎమ్మెల్సీ ఇచ్చారు. ట్యాంక్‌బండ్‌పై పీవీ విగ్రహం, నెక్లెస్ రోడ్‌కు పీవీ మార్గ్‌గా నామకరణం, అసెంబ్లీలో చిత్రపటం ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దే. కేసీఆర్‌కు, కేంద్రానికి ధన్యవాదాలు.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

### మొదట తీర్మానం చేసింది బీఆర్ఎస్సే..



నర్సంపేట రూరల్: పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడం గర్వించదగిన విషయం. నర్సంపేట నియోజకవర్గంలోని మారుమూల లక్నేపల్లిలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి దేశానికి ప్రధాని అయ్యారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని కేసీఆర్ నాయకత్వంలో అసెంబ్లీలో తీర్మానం చేశాం. బలపరిచే అవకాశం నాకు దక్కింది.

– పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

### సంస్కరణ శీలి.. మన పీవీ



దేశాన్ని సంస్కరించిన మహనీయుడు పీవీ. ఆయనకు గ్రూపు రాజకీయాలు రావు. ప్రజలే ఆయన గ్రూపు. అందుకే ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిండు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో పీవీ శత జయంతి ఉత్సవాలు జరిగాయి. పీవీ జీవిత చరిత్రను ప్రపంచవ్యాప్తం చేశారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీలో తీర్మానం చేశారు.

– సుధీర్‌కుమార్, జడ్పీ చైర్మన్, హనుమకొండ

# గులాబీ జెండాతోనే ప్రజలకు రక్ష

**బీఆర్ఎస్ పార్టీ.. ఫీనిక్స్ పక్షి.. రెట్టింపు శక్తితో వస్తుంది**

- కాంగ్రెస్ పాలన ఇది శాంపిలే.. తర్వాత తీవ్ర రూపం
- కృష్ణా ప్రాజెక్టు కేంద్రానికి ధారాదత్తం: ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- నాయకులు, కార్యకర్తలను వేధిస్తే ఊరుకోం : బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 9: 'ఓయూ విద్యార్థుల అరెస్ట్, అసెంబ్లీ ముందు ఇనుప కంచెల విస్తరణ, వ్యవసాయ వర్సిటీ భూముల విషయంలో విద్యార్థుల జుట్టుపట్టి లాగడం.. ఇదీ కాంగ్రెస్ ప్రజాపాలన. కాంగ్రెస్ రావడం అంటే కష్టాలు రావడమేనని ప్రజలకు ఇప్పుడే తెలుస్తోంది' అని ఎమ్మెల్సీ, కవి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం హనుమకొండలోని పార్టీ ఆఫీస్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పోరాడితేనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, కానీ గవర్నర్ ప్రసంగంలో సోనియాగాంధీ దయతో తెలంగాణ ఇచ్చిందనడం సరికాదన్నారు. బీడు పొలాలకు దాహార్తిని తీర్చిన నాయకుడు, 50ఏళ్ల కలను సాకారం చేసిన ఉద్యమనేతకు చాలా చిన్న చాంబర్, విడివిడిగా రెండు రూంలు కేటాయించడం.. ఇదీ కాంగ్రెస్ సంస్కారమని ఎద్దేవా చేశారు. ఇది కాంగ్రెస్ ప్రజాపాలన శాంపిల్ మాత్రమేనని, రాబోయే రోజుల్లో తీవ్రరూపం చూపిస్తారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఫీనిక్స్ పక్షిలాంటిదని, తిరిగి కొత్త ఆలోచనలు, రెట్టింపు శక్తితో మళ్లీ వస్తుందన్నారు. ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాని మోడీతో మాట్లాడారని, ఇద్దరు కలిసి బీఆర్ఎస్‌ను లేకుండా చేయడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. ప్రణయ్‌భాస్కర్ అసెంబ్లీలో జై తెలంగాణ నినాదాలు చేశారని, తమ్ముడు వినయ్‌భాస్కర్ కాకతీయ ఉత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ మంత్రుల ఎదుట బైఠాయించి తెలంగాణ నినాదాలు చేశారని గుర్తుచేశారు. మార్పు రావాలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాహనాలకు నంబర్ ప్లేట్ మార్చనుందని, ప్రజలకు కొత్తగా ఖర్చులు రానున్నాయని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రిది ఉద్యమద్రోహి చరిత్ర అన్నారు. అవగాహన లేని, అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణా ప్రాజెక్టును కేంద్రానికి ధారాదత్తం చేసిందని, నీళ్లు ఎవరికి వదలాలనేది వారిచేతిలోనే పెట్టిందన్నారు. ఈ ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ఉండాలని కండీషన్ పెట్టడాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారని, గులాబీ జెండానే వారికి రక్షణ కవచమన్నారు. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ ప్రసంగం మధ్యలో పాటలు పాడుతూ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు. పీవీ శతజయంతి ఉత్సవాల ఫలితంగా తెలంగాణ బిడ్డ, మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం అభినందనీయమన్నారు.




పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, చిత్రంలో దాస్యం వినయ్‌భాస్కర్

### త్వరలో పార్టీ బలోపేతానికి కమిటీలు: దాస్యం

బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కాంగ్రెస్ నాయకులు వేధిస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రతినెలా 10వ తేదీలోగా సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తానని అన్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు అందించినా విస్తృతప్రచారం లేకపోవడం, ఎక్కడో చిన్న పొరపాటు జరిగిందని చెప్పారు. ఉద్యమ సమయంలో నాతోపాటు కేసుల్లో ఉన్న వారికి పార్టీని ఒప్పించి, మెప్పించి పదవులు ఇప్పించినట్లు గుర్తుచేశారు. ఉద్యమాలు కొత్త కాదని, తెలంగాణ కోసం అనేక ఉద్యమాలు చేశామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. దళితుల ఆర్థికాభివృద్ధికి దళితబంధు ఇచ్చారని, బీసీ, మైనార్టీ బంధు కూడా ఇచ్చామని, వాటిని అమలు చేసేవరకూ ఉద్యమిస్తామన్నారు. పేదలు గుడిసెలు వేసుకుంటే పట్టాలు ఇప్పించామన్నారు. కాంగ్రెస్‌లో పేదల గురించి ఆలోచించే నాయకుల్లేరని, అందుకే గుడిసెలు, తోపుడు బండ్లు తొలగిస్తున్నారని, స్ట్రీట్‌వెండర్స్ యాక్ట్ సుప్రీంకోర్టు నుంచి వచ్చిందని, తొలగించే హక్కు ఎవరికీ లేదని, పేదల జోలికి వస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కులసంఘాలకు భవనాలు కేటాయించామని, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీ వస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పటిష్టతకు త్వరలోనే బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి కమిటీలు వేస్తామన్నారు. త్వరలో డివిజన్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించి, పార్టీ కోసం పనిచేసేవారిని గుర్తించి పదవులు ఇస్తామన్నారు. కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు బొంగు అశోక్‌యాదవ్, చెన్నం మధు, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేశ్, బీఆర్ఎస్ నాయకులు జనార్దన్‌గౌడ్, ఉడుతల సారంగపాణి, పులి రజినీకాంత్, కంజర్ల మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

# ఎన్నికలకు సిద్ధం

**లోక్‌సభ ఎలక్షన్లకు తుది ఓటరు జాబితా సిద్ధం**

**అంతటా మహిళా ఓటర్లే ఎక్కువ**

వరంగల్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలకు ఓటర్ల తుది జాబితా సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను ప్రకటించింది. మొత్తం ఓటర్లు, మహిళలు, పురుషుల, థర్డ్‌జెండర్, సర్వీసు ఓటర్ల వివరాలతో తుది జాబితాను రూపొందించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల ఓటర్ల సంఖ్య పెరిగింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నారు. తుది జాబితా సిద్ధం కావడంతో ఎన్నికలకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మండలాలు, అసెంబ్లీ సెగ్మెంట్లకు అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఈసీ బాధ్యులుగా నియమించింది. ప్రస్తుతం లోక్‌సభ నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులను నియమించనున్నది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా... ఆయా పరిధిలోని మండలాలు, గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల గుర్తింపు, రేషనలైజేషన్, పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తుందనే అంచనాలతో జిల్లాల్లోని అధికారులు సన్నద్ధమవుతున్నారు.

**నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు**

జనగామ 2,41,279, స్టేషన్ ఘన్‌పూర్ 2,52,784, పాలకుర్తి 2,54,949, డోర్నకల్ 2,22,552, మహబూబాబాద్ 2,58,027, నర్సంపేట 2,35,338, పరకాల 2,22,419, వరంగల్ పశ్చిమ 2,81,997, వరంగల్ తూర్పు 2,56,592, వర్ధన్నపేట 2,72,250, భూపాలపల్లి 2,76,705, ములుగు 2,32,091, హుజూరాబాద్ 2,49,432, హుస్నాబాద్ 2,46,377, మంథని 2,39,263, ఇల్లెందు 2,24,672, భద్రాచలం 151940.